నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బొల్లిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. బొల్లిగూడెం, అంజయ్య ఎన్‌క్లేవ్, అమ్మసాని వెంకటరెడ్డినగర్, ఎస్‌బీఆర్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, రాజలింగం కాలనీ ఫేస్- 1, సూరజ్‌నగర్, మహాలక్ష్మినగర్, బాలాజీనగర్, లక్ష్మారెడ్డినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సూర్యనగర్, లక్ష్మీనరసింహ ఫీడర్ల పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శక్తి సాయినగర్, సూర్యనగర్, ఉదయ్‌నగర్, మల్లికార్జున్ నగర్, గుల్మోర్ గార్డెన్స్, చండియానగర్, గోకుల్ నగర్, బ్యాంక్‌కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, మైఫ్లవర్ హైట్స్, లక్ష్మీనరసింహకాలనీ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి



అల్వాల్: బీజేపీ నేరేడ్‌మెట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణబాబు ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీజేపీ నేరేడ్‌మెట్ డివిజన్ అధ్యక్షుడిగా లక్కినేపల్లి ఆదిత్య ఎన్నికైన ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. బీజేపీ సీనియర్ కార్యకర్తల స్ఫూర్తి, సహకారం, రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనను ఎన్నుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆదిత్య కృతజ్ఞతలు తెలిపారు. సుధాకర్, హరిశ్చంద్ర పులి, ప్రసన్న, రమణారెడ్డి, పరమేష్, ధనలక్ష్మి, మల్లిక, భాస్కర్‌గౌడ్, సంజులాల్, సాయి, శ్యామ్ తదితరులున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



గౌతంనగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు భాష్యం విద్యాసంస్థలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నాయని విద్యాసంస్థల సీఈవో చైతన్య అన్నారు. భాష్యం విద్యార్థుల ప్రిలిమినరీ క్రికెట్ మ్యాచ్ సోమవారం కీసరలోని స్కై పార్క్ మైదానంలో నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జోన్-2 జట్టు రెండు మ్యాచ్‌లలోనే గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కి చేరుకుంది. విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, జెడ్ఈఓలు మార్కండేయులు, అంకమ్మరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్‌కు శాశ్వత భవనం కేటాయించండి

మల్లాపూర్: డేకేర్ సెంటర్‌కు శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం కాప్రా డిప్యూటీ కమిషనర్‌కు ఆసరా కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, ఆసరా కార్యవర్గసభ్యులు, ప్రధాన కార్యదర్శి సాయిబాబా, ఫైనాన్స్ సెక్రటరీ శ్రీశైలం, కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలం పరిరక్షణ

అల్వాల్: కాలనీలోని పార్కు స్థలాన్ని పరిరక్షించిన హైడ్రాకు అల్వాల్ సాయిబాబానగర్‌వాసులు కృతజ్ఞతలు తెలిపారు. వివరాల ప్రకారం .. అల్వాల్ సర్కిల్ పరిధిలోని సాయిబాబానగర్ సర్వే నెంబర్ 592,593లోని సుమారు 1600 చదరపు గజాల స్థలం కొందరు ఆక్రమణకు ప్రయత్నించగా.. కాలనీవాసులు హైడ్రా సంస్థకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీచేయడంతో పాటు స్థలాన్ని కాలనీవాసులకు అందజేసి చుట్టూ ప్రహరీ కూడా నిర్మించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అధికారులు సోమవారం స్థలాన్ని చదునుచేసి ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు విస్తరణ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి

మేడ్చల్: మేడ్చల్ పరిధిలోని 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కండ్లకోయ నుంచి ఎల్లంపేట్ వరకు ఆస్తులు నష్టపోతున్న వారికి ప్రభుత్వం అధిక నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మేడ్చల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకుడు నందారెడ్డి, జగన్‌గౌడ్, పట్టణ అధ్యక్షురాలు శైలజ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

గుంపులుగా చేరి భయపెడుతున్నాయ్ !

- వీధి కుక్కల బెడదతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- నియంత్రణ చర్యలు చేపట్టాలని..
- అధికారులకు వినతి

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. న్యూ అండ్ ఓల్డ్ మిర్జాల్‌గూడ, వెంకటాద్రినగర్, జ్యోతినగర్, మల్లికార్జుననగర్, వాణీనగర్, భవానీనగర్, గౌతంనగర్, మల్కాజిగిరి రైల్వేస్టేషన్, ఏకలవ్యనగర్, ఇందిరానెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో వీధికుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతూ రాకపోకలు సాగించే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. నగర వ్యాప్తంగా వీధికుక్కలు గుంపులు గుంపులుగా చేరి చిన్నారులు, వృద్ధులపై దాడి చేస్తున్నాయని స్థానికులు ఆవేదన్న వ్యక్తం చేస్తున్నారు.



మిర్జాల్‌గూడలో గుంపులుగా వీధి కుక్కలు

గతంలో చిన్నారికి గాయాలు..

గతంలో గౌతంనగర్ కాలనీలో ఓ చిన్నారిని గాయపరిచి నోట కరుచుకున్నాయని వాపోయారు. సంబంధిత అధికారులు దీనిపై స్పందించి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్లపై వెళ్లాలంటేనే భయం



వీధికుక్కలు రోడ్లపై గుంపులుగుంపులుగా తిరుగుతూ.. భయాందోళనను కలిగిస్తున్నాయి. రోడ్డు పక్కన తిష్టవేసి ప్రజలను భయపెడుతున్నాయి. రోడ్డు పక్కనే చెత్తా, చెదారం వేస్తుండటంతో ఆహారపదార్థాల కోసం వచ్చి దాడి చేస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్డు మార్గాల మీదుగా వెళ్లాలంటేనే భయమేస్తుంది.

– మాశెట్టి అనిల్‌గుప్తా, వాణీనగర్

నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గుంపులుగుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగస్తులు, వ్యాపారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు భయాందోళకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసన్, మల్లికార్జుననగర్

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలి



రమణారావు, మాధవిని అభినందిస్తున్న లయన్స్ ప్రతినిధులు

కుషాయిగూడ: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని సివిల్ మెంటర్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ అధినేత బాలలత అన్నారు. చర్లపల్లి సీఐఏ ఆడిటోరియంలో 'రమణీయం' పేరుతో ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్-320-హెచ్ తిలక్ రీజియన్ మీట్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గత 6 నెలలుగా చేపట్టిన సేవా కార్యక్రమాలను రీజియన్ చైర్‌పర్సన్ పీవీ.రమణరావుమాధవీ దంపతులు పోస్టర్ ప్రదర్శనతో వివరించారు. 13 క్లబ్‌ల ప్రతినిధుల పరస్పర సహకారంతో ముందుకెళ్తున్నామన్నారు. రీజియన్ అడ్వైజర్ ఎస్. మనోహర్‌రాజు, సునైనా, అమీనా, నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, అంబటి వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాలరావు, సురేష్, తులసీదాస్‌రెడ్డి, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్ట్రీట్ వెండర్స్ డే

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ జీహెచ్ఎంసీ స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్ట్రీట్ వెండర్స్‌డే'ను ఆనంద్‌బాగ్‌లో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బాజీభాష మాట్లాడుతూ.. తమ వ్యాపారాలు సరిగ్గా జరగడం లేదని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. యాదగిరి, జాన్, అలివేలు, లక్ష్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీకి మైక్‌సెట్, సీసీ కెమెరా అందజేత



గౌతంనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ మల్కాజిగిరి ఒలింపిక్స్ 3వ చార్టర్ నైట్ అండ్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ సుజాతాఅశోక్ సోమవారం జీహెచ్ఎంసీకి మైక్‌సెట్, సీసీ కెమెరాను అందజేశారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కృష్ణప్రసాద్, శేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, టీఎస్.అశోక్‌కుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాల్యుయేషన్ అధికారులపై డీసీకి ఫిర్యాదు

కుషాయిగూడ: కాప్రా సర్కిల్ కార్యాలయంలోని వాల్యుయేషన్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నాదం, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, వెంకటేశ్వర్లు సోమవారం డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇంటి నెంబర్ల కేటాయింపు, టాక్స్‌ను నిర్ణయించడంలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డీసీని కోరినట్లు చెప్పారు.

ఓయూ భూములను పరిరక్షించండి

హబ్సిగూడ: ఓయూ భూములను పరిరక్షించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు వీసీ ప్రొఫెసర్ కుమార్‌ను సోమవారం కోరారు. హబ్సిగూడ రవీంద్రనగర్ కాలనీలో ఓయూకు చెందిన సుమారు రూ.10 కోట్ల విలువైన 1000 గజాల స్థలంలో బయటి వ్యక్తులు బోర్డు ఏర్పాటు చేశారన్నారు. ఓయూ లీగల్‌సెల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. కబ్జాలకు గురైన భూములను గుర్తించి పరిరక్షించాలని వీసీని కోరామన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

కుషాయిగూడ: దశలవారీగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. సోమవారం ఆమె చర్లపల్లి డివిజన్, నేతాజీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణాలు, కరెంట్ పోల్స్ వంటి అవసరాలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. మొదటి ప్రాధాన్యతగా యూజీడీ పనులను ప్రారంభించి దశలవారీగా అన్ని సమస్యలు తీరేలా చూస్తానన్నారు. కాలనీవాసులు మహేష్, అశోక్, శ్రీనివాస్, భాస్కర్, పాండుముదిరాజ్, మల్లేష్ తదితరులున్నారు.



నేతాజీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కేలండర్ల ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. పీర్జాదిగూడ నగర ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్‌రెడ్డి, ఉప్పల్ బిల్డర్ మెంబర్లు, 25వ డివిజన్ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో జల్లి మోహన్ తదితరులు

ఉప్పల్: చిలుకానగర్‌లో కాపు సంఘం ఆధ్వర్యంలో నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నేత జల్లి మోహన్ హాజరై ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మున్నూరు కాపులు రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. చిలుకానగర్ కాపు సంఘం అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు నాగు నర్సింహ, నవీన్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి నరేష్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమ గొంతుకకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: తెలంగాణ మలిదశ ఉద్యమకారురాలు డోలి కృష్ణవేణి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో కృష్ణవేణిసుధీర్ కుటుంబం మొత్తం మలిదశ ఉద్యమం పాల్గొన్నారన్నారు. ఉద్యమకారులు పుట్నాల కృష్ణ, చంద్రశేఖర్, ఢిల్లీ పరమేష్ పాల్గొన్నారు.

కాప్రా: ఏఎస్‌రావునగర్ డాక్టర్ హోమీజేబాబా కమ్యూనిటీహాల్‌లో ఎండీ ఆండాలి సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ.. పార్టీ, సమాజం పట్ల నిబద్ధతతో ఆండాలి ఎంతో కృషి చేశారన్నారు. తన కుటుంబాన్ని కూడా పార్టీ ఆశయాలకు అనుగుణంగా పెంచారని చెప్పారు. సత్యం, జగ్గరాజు, బీఏన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, మాణిక్యాలరావు, కొండారెడ్డి, దుర్గాచార్యులు, శ్రీమన్నారాయణ, జగన్, సత్యం, యాదయ్య పాల్గొన్నారు.



సంస్మరణ సభలో సీపీఎం నేతలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ సిబ్బంది

కుషాయిగూడ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బాపురెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సోమవారం కుషాయిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. తడి,పొడి చెత్తపై అవగాహన కలిప్ంచడంతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన 'ఆర్ఆర్ఆర్' సెంటర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటరీ సూపర్‌వైజర్ సెంటర్ల పనితీరుపై ప్రదర్శన నిర్వహించి విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు, ఇరుగు పొరుగు వారికి అవగాహన కల్పించి స్వచ్ఛతకు మీ వంతుగా పాటుపడాలని విద్యార్థులను కోరారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న న్యూస్ పేపర్లు, ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్ వస్తువులను కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ఆర్ఆర్ఆర్' సెంటర్లకు తరలించేలా చూడాలన్నారు. శానిటేషన్ సిబ్బంది రాజన్, రామకృష్ణ, దశరథ్, కృష్ణ, మంజుల, సుజాత, లక్ష్మి, శిరీష, అరవింద్, అశ్వినిప్రసాద్, వరలక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించండి

మల్కాజిగిరి: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ డీసీ రాజుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో భాగంగా పలు సమస్యలను ఆయన డీసీ దృష్టికి తీసుకెళ్లారు. సఫిల్‌గూడలోని పార్క్‌లో పాత ఆట వస్తువులకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. హెచ్ఎండీఏ నిధులతో నిర్మించిన ఫుట్‌పాత్‌లకు మరమ్మత్తులు చేయాలని పేర్కొన్నారు. 3 ఫిర్యాదులు వచ్చాయని వాటిని పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని డీసీ కార్పొరేటర్‌కు వివరించారు.



డీసీతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు



అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నేర్లకంటి శ్రీనివాస్

కుషాయిగూడ: వాసవి క్లబ్ కాప్రా సర్కిల్, వాసవి క్లబ్ వనిత కాప్రా సర్కిల్, వాసవి క్లబ్ కపుల్స్ కాప్రా సర్కిళ్ల క్లబ్‌ల ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని హెచ్‌బీకాలనీ, కైలాసగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యవర్గ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్, గవర్నర్ ప్రదీప్‌కుమార్‌లు హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. వారు మాట్లాడుతూ.. తమ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మెడిసిన్ చదువుతున్న పేద విద్యార్థినికి రూ.5000 ఆర్థికసాయం అందజేయగా.. క్లబ్ సభ్యురాలు శారద 6 పేద కుటుంబాలకు ప్రతి నెల రూ.500 సాయం అందజేస్తానన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటుగా సమాజాన్ని చైతన్య పరిచే కార్యక్రమాలను నిర్వహిస్తామని నూతన అధ్యక్షుడు నేర్లకంటి శ్రీనివాస్ తెలిపారు. క్లబ్ ప్రతినిధులు వనం నరేందర్, వనజ, సముద్రాల కృష్ణమూర్తి, నవీన్‌కుమార్, గంగా శ్రీనివాస్, సి. శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, రామచంద్రం, రమణకుమార్, లక్ష్మీనర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను హతమార్చి..

- మహిళ అనుమానాస్పద మృతి కేసులో నిందితుడి అరెస్టు

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్, నాగార్జుననగర్ కాలనీ రోడ్డు నెంబరు-5లో గత శనివారం వెలుగుచూసిన మహిళ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. భార్యపై అనుమానంతోనే హతమార్చి సహజ మరణంగా చిత్రీకరించేందుకు యత్నించి పరారయ్యాడు. సోమవారం ఎస్సై వెంకన్న కేసు వివరాలను వెల్లడించారు. కాచిగూడకు చెందిన సచిన్ సత్యనారాయణ, టూగూర్ స్నేహలు 2021లో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమై 2022లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ బాబు పుట్టి చనిపోయాడు. ఈ క్రమంలో వారి మధ్య గొడవల కారణంగా కొద్ది రోజుల పాటు వేరుగా ఉండి నెల రోజుల క్రితమే తిరిగి నాగార్జుననగర్ కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. భార్య 7 నెలల గర్భవతి అని తెలుసుకున్న భర్త ఆమెను అనుమానించాడు. శారీరకంగా దూరంగా ఉన్నా గర్భం రావడంపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 16న తెల్లవారుజామున 5 గంటల సమయంలో మంచంపై పడుకున్న భార్య ముఖంపై దిండు అదిమిపెట్టి ఊపి రాడకుండా చేసి హత్య చేశాడు. ఘటన స్థలంలో సిలిండర్ ఆన్‌చేసి సహజ మరణంగా చిత్రీకరించేందుకు యత్నించి పరారయ్యాడు. ఆమె మృతిపై అనుమానం వచ్చిన పోలీసులు సోమవారం మృతురాలి భర్తను కాచిగూడలోని అతడి ఇంట్లో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. తానే హతమార్చినట్లు నేరం అంగీకరించినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితుడిని కోర్టు ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.



నిందితుడు సచిన్ సత్యనారాయణ

'టీజీఎస్ఎస్ఐసీ' స్థల పరిశీలన

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ కాలనీ ఎన్ఎఫ్‌సీ కంపెనీ ప్రహరీకి ఆనుకుని ఉన్న టీజీఎస్ఎస్ఐసీ ఖాళీస్థలం ప్రజలకు ఉపయోగపడేలా చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఎంపీ స్థలాన్ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే బండారి

అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు

- సమగ్ర సర్వే చేశాకే ఇస్తామన్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డును అందజేస్తామని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని కురుమానగర్‌లో జరుగుతున్న రేషన్‌కార్డుల సర్వేను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని సమగ్రంగా సర్వే చేసిన తర్వాతే కార్డుల జారీ జరుగుతుందన్నారు. అర్హులను గుర్తించడంలో అధికారులు అలసత్వం వహించకూడదని సూచించారు. నేటి నుంచి 24 వరకు జరిగే వార్డు సమావేశాల్లో కొత్త వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దుర్గం నవీన్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌కుమారస్వామి, రామకృష్ణ, దేవిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతు తదితరులున్నారు.



సర్వేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి తదితరులు

నేటి నుంచి బోడుప్పల్‌లో వార్డు సభలు..

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మూడ్రోజుల పాటు 28 డివిజన్లలో వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామలింగం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఈ వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. నేడు 1వ డివిజన్ నుంచి 10వ డివిజన్ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. 22న 11వ డివిజన్ నుంచి 19వ డివిజన్ వరకు, 23వ తేదీన 20 నుంచి 28 డివిజన్లలో నిర్వహించే ఈ సమావేశాల్లో లబ్ధిదారులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారి నుంచి కూడా దరఖాస్తులను స్వీకరిస్తామని స్పష్టం చేశారు.